క్లుప్తంగా

నేటి నుంచి అమ్మవారి మహోత్సవాలు


మొగధారమ్మ అమ్మవారు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడ, ముసలయ్యపాలెం ఆరాధ్య దేవతలు శ్రీ మొగధారమ్మ, శ్రీ దుర్గాలమ్మ, శ్రీనూకాలమ్మ అమ్మవార్ల ప్రధాన పండగ మంగళవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నారు. రెండు రోజులపాటు నిర్వహించే మహోత్సవాలకు నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నామని తెలిపారు.

ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నేడు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ ఆలయం వద్ద మంళవారం ఉదయం 6 గంటల నుంచి ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నారు. బెస్ట్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలను స్థానికులు వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

రోగులకు కంటి వైద్య పరీక్షలు


మధురవాడలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్‌లో గల శ్రీ నాగదుర్గా దేవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సోమవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇక్కడ నియో విజన్ కంటి ఆస్పత్రి వైద్యుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది చిరంజీవి, అప్పారావు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. రాజేష్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో బీజేపీ నాయకుడు గండికోట బ్రహ్మాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ భక్తులకు ప్రాధాన్యమివ్వండి

తగరపువలస: తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనాలకు వచ్చే సాధారణ భక్తులకు ప్రాధాన్యమివ్వాలని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త జి.అప్పన్న టీటీడీ ఈవో జె.శ్యామలరావును కోరారు. ఈ మేరకు సోమవారం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. కొండపై ఎంతో పవిత్రంగా భావించే అన్నప్రసాదాల విషయంలో నాణ్యత పాటించాలని కోరారు. గతంలో మాదిరిగా జిల్లా కేంద్రాల్లోని టీటీడీ కల్యాణమండపాలకు అనుబంధంగా ఉన్న సమాచార కేంద్రాల ద్వారా ఆఫ్‌లైన్ విధానంలో భక్తులు సులభంగా దర్శన టికెట్లు, వసతి బుకింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

సేఫ్టీ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్న సేఫ్టీ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్లు గెస్ట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఆదివారం నుంచి విద్యార్థులకు థియరీకి అనుగుణంగా ప్రాక్టికల్స్ షెడ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ, కెమికల్ ఇంజినీరింగ్ సేఫ్టీ కోర్సుల్లో విద్యార్థులు ఈ ప్రాక్టికల్స్‌లో ప్రత్యక్షంగా పాల్గొని నైపుణ్యాలను సాధిస్తున్నారని, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కోర్సు కో ఆర్డినేటర్ ఎ.వరహాలు పర్యవేక్షణలో సేఫ్టీ కోర్సు ఫ్యాకల్టీ డి.తులసీరావు విద్యార్థులకు ప్రయోగాత్మక బోధన నిర్వహించారు.

లో ఓల్టేజీతో నిత్యం అవస్థలు


నిత్యం లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న చంద్రంపాలెం గ్రామం

- చంద్రంపాలెం, శివశక్తి నగర్ వాసులకు ఇబ్బందులు
- 1500 నివాసాలకు రెండే ట్రాన్స్‌ఫార్మర్లు
- కాలిపోతున్న గృహోపకరణాలు

మధురవాడ: లో ఓల్టేజీ సమస్యతో చంద్రంపాలెం, శివశక్తి నగర్ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. భగభగ మండే భానుడి ప్రతాపం నుంచి రక్షించుకునేందుకు ఏసీలు వినియోగించడం మాట అటుంచితే... కనీసం ఫ్యాన్లు కూడా తిరగక ఇబ్బందులు పడుతున్నారు. ట్యూబ్ లైట్లు కూడా సరిగ్గా వెలగడం లేదని చంద్రంపాలెం గ్రామస్తులు, శివశక్తినగర్ రోడ్డు ముత్యాలమ్మ గుడి వద్ద ఉన్న లక్ష్మి టవర్స్ అపార్ట్‌మెంట్, పరిసర ప్రాంతాల వాసులు వాపోతున్నారు. ఈ ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడంతోపాటు, కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

చంద్రంపాలెం వాసులకు నిత్యం వేదనే

జీవీఎంసీ 7వ వార్డు జాతీయ రహదారిని ఆనుకుని ఎన్‌జీజీవోస్ లే అవుట్ – కళానగర్, ఇంకో వైపు మిథిలాపురి ఉడా కాలనీ – పోర్టు కాలనీల మధ్య ఉన్న చంద్రంపాలెం గ్రామంలో సుమారు 1800 నివాసాలు ఉన్నాయి. ఇక్కడ చంద్రంపాలెం పాత ఊరికి బాపూజీ కళామందిరం వద్ద ఒక ట్రాన్స్‌ఫార్మర్, కొత్త ఊరుకి భరత్‌నగర్ వద్ద రెండో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అయినా ఈ రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఇక్కడి ప్రజల విద్యుత్ అవసరాలు తీర్చలేకపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ ఇన్వర్టర్ ఉంటేనే తప్ప సాధారణంగా ఏసీ పని చేయడం లేదు. ట్యూబు లైట్లు, వీధిలైట్లు కూడా సక్రమంగా వెలగడం లేదని, కొన్ని సందర్భాల్లో ఏసీ, టీవీలు వంటి విద్యుత్ గృహోపకరణాలు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 9 గంటలు దాటితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని వాపోతున్నారు.


బాపూజీ కళా మందిరం వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్


చంద్రంపాలెం కొత్తూరు సమీప భరత్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్


లక్ష్మి టవర్స్ అపార్ట్‌మెంట్ వద్ద సరిపడా విద్యుత్ సరఫరా చేయని ట్రాన్స్‌ఫార్మర్లు

శివశక్తినగర్ రోడ్డులోనూ ఇబ్బందులే

కొమ్మాది జంక్షన్ నుంచి శివశక్తినగర్‌కు వెళ్లే రోడ్డులోని లక్ష్మీ టవర్స్ అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో కూడా లో ఓల్టేజీతో స్థానిక నివాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, మళ్లీ వెంటనే రావడంతో గృహోపకరణాలు కాలిపోతున్నాయని వాపోతున్నారు. ఇక్కడ అపార్ట్‌మెంట్‌తోపాటు, పరిసర ప్రాంతాల్లో వున్న ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా చేయలేకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణ చర్యలు చేపడతాం

చంద్రంపాలెం, శివశక్తినగర్ రోడ్డులో లో ఓల్టేజీ సమస్య మా దృష్టికి రాలేదు. వేసవి ప్రారంభం కాకముందే చాలా వరకు లో ఓల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాలు గుర్తించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం, పాతవాటి సామర్థ్యం పెంచేందుకు చర్యలు చేపట్టాం. ఈ ప్రాంతాల్లో తక్షణమే పూర్తి స్థాయిలో పరిశీలించి లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

– ఎస్‌వీఎస్ రామమూర్తి, ఏఈఈ, మధురవాడ.


ట్రాలర్ ఆగిపోవడంతో జాతీయ రహదారిపై తాళ్లవలస వద్ద రైలింజన్

జాతీయ రహదారిపై రైలింజన్

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై సోమవారం ఒక భారీ ట్రాలర్ సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. తమిళనాడు నుంచి కోల్‌కత్తా వైపు ఈ ట్రాలర్ రైలింజిన్‌ను తీసుకుని వెళ్తోంది. మధ్యలో మొరాయించడంతో ట్రాలర్‌ను అక్కడే నిలిపివేసి దాని ఇంజిన్‌ను మరమ్మతులకు తరలించారు. రహదారిపై ఆగిపోయిన రైలింజిన్ వద్ద వాహనదారులు ఆగి సెల్ఫీలు తీసుకుని మురిసిపోయారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

- అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు
- తరలి వచ్చిన భక్తులు

సింహాచలం: సింహగిరికి భక్తులు పోటెత్తారు. ఆధ్యాత్మిక చింతనలో మునిగి తేలారు. అప్పన్న ఆర్జిత సేవల్లో పాల్గొని తరించారు. అనంతరం స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేష వస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- సింహాచలేశుడికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంచేయజేసి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. విశేషంగా హారతులు అందజేశారు.పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.


సహస్రనామార్చన చేస్తున్న అర్చకుడు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు


నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

జీవో 117 రద్దు చేయాలి

ఆరిలోవ: ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారిన జీవో 117ను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ యూనియన్(ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడు ఇమంది సత్యనారాయణ కోరారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ 10వ వార్డు ఎస్ఐజీ నగర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. సమస్యలు పరిష్కారానికి ఎస్టీయూ కార్యవర్గం కృషి చేయాని నిర్ణయించారు. అనంతరం ఇమంది మాట్లాడుతూ 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల డ్రాప్ అవుట్ల సంఖ్య పెరిగిపోతుందన్నారు. విద్యా వ్యవస్థలో పర్యవేక్షణ పేరుతో ఉన్న యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంగ్లిష్ మీడియంతో సమానంగా తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చంద్ర పద్మావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దేవుడుబాబు, ఉపాధ్యక్షుడు కె.ప్రభాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇమంది

భక్తితో బక్రీద్ పండగ


బక్రీద్ ప్రార్థనలో ముస్లింలు

భీమునిపట్నం: భీమిలిలో బక్రీద్ పండగ సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జామియా మసీద్ ఇమామ్ నాసిమ్ అక్తర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీద్ కమిటీ సభ్యులు అన్వర్ హుస్సేన్, అబ్దుల్ నయిం, అబ్దుల్ మతీన్, షేక్ యాసిన్ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

తగరపువలస: త్యాగానికి ప్రతీక బక్రీద్ పండగని భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు అన్నారు. సోమవారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని భీమిలిలో హిందీ విద్యార్థులతో బక్రీద్ వేడుకలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ త్యాగం చేయడం అలవరచుకుని పొరుగు వారికి సాయపడాలని కోరారు. ఏ మతమైనా చెప్పే సారాంశం అదేనన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, విద్యార్థులు షేక్ చాను, సైరా భాను, ఆష్మాఖాతూన్, నిధాత స్లీమ్, రహీం, అసిరఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ తొలేళ్ల ఉత్సవం

పద్మనాభం: పద్మనాభం గ్రామంలోని దుర్గాలమ్మ తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమలను గ్రామంలో ఊరేగించారు. అమ్మవారి ఆలయం, పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి. మంగళవారం రాత్రి రథాన్ని గ్రామంలో ఊరేగిస్తారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమో దు చేసుకోవాలి.

వైభవంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: తోటగరువులోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా సోమవారం ఆలయ ఆవరణలో ధ్వజ స్తంభం, లక్ష్మీ గోదా సమేత గరుడ విగ్రహం ఆవిష్కరణ చేశారు. అనంతరం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణం న్విహించారు. భక్తిశ్రద్ధలతో హోమం జరిపారు.

కనులపండువగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

పీఎం పాలెం: పీఎం పాలెం ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకర మఠంలో సోమవారం సాయంత్రం శ్రీ ఉమా సిద్దేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ ఏకాదశి మహారుద్రాభిషేకం, అనంతరం అలంకారం, ప్రత్యేక అర్చనలు చేశారు. సాయత్రం 5 గంటలకు రుద్రహోమం, మర్తి హోమం, శాంతి హోమం అనంతరం వార్షికోత్సవ హోమం నిర్వహించారు. సాయంత్రం 7 గంటల నుంచి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వేడుకగా నిర్వహించారు. కార్యక్రమాన్ని మఠం గౌరవ పాలనా ప్రతినిధి జగర్లపూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. అలాగే కారుషెడ్ కూడలికి సమీపంలోని శ్రీ ఉమా కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. వందలాది మంది భక్తులు హాజరయ్యారు.


శ్రీ శృంగేరీ శంకర మఠంలో విశేష పూజలందుకున్న పరమశివుడు

అర్ధరాత్రి వేళ ఆకతాయిల తిష్ట

తగరపువలస: చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ సమీపంలో రోజూ అర్ధరాత్రి ఆకతాయిలు తిష్టవేసి చుట్టుపక్కల వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. రాత్రి 11 గంటల తర్వాత గోస్తనీనది తీరంలో చిట్టివలస శ్మశానవాటిక వద్ద పదుల సంఖ్యలో ఆకతాయిలు మత్తు పదార్థాలు సేవించి గుడివాడ వంతెన అప్రోచ్ రోడ్డు మీదకు చేరుకుంటున్నారు. అక్కడ రాత్రివేళ వచ్చేవారిని అడ్డగించడం, చుట్టుపక్కల ఇళ్లపై రాళ్లు వేయడం చేస్తున్నారని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ కూడలిని ఆనుకుని చిట్టివలస జెడ్పీ హైస్కూల్, బాలికల జెడ్పీ హైస్కూల్, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, శివాలయం, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, కొండపేట పంప్‌హౌస్ మార్గంలో 200 వరకు ఇళ్లున్నాయి. శివారు ప్రాంతంతోపాటు రాత్రి వేళ నిర్మానుష్యంగా ఉండడం వల్ల వీళ్ల ఆగడాలు రాత్రి 2 గంటల వరకు సాగుతున్నాయని వాపోతున్నారు. మత్తులో వీరు ఎలాంటి దురాగతాలకు పాల్పడతారోనని నిత్యం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భీమిలి పోలీసులు ఈ ప్రాంతంలో రాత్రివేళ నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నివాసాల మధ్య అడవి పందుల మాంస వ్యర్థాలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్, యాతపేట గ్రామంలో నివాసాల మధ్య అడవి పందుల మాంస వ్యర్థాలు పడేస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తున్నందున ఈ ప్రాంతంలోని వేటగాళ్లు ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని కొండ ప్రాంతాల్లో వేటకు వెళ్లి అడవి పందులను వలలతో బంధించి బాలాజీనగర్ తీసుకొస్తున్నారు. వీటిని ఇక్కడే వధించి మాంసాన్ని చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయిస్తుంటారు. ఇలా వచ్చిన వ్యర్థాలను దూరంగా పడేయకుండా నివాసాల మధ్యే వదిలేయడం వల్ల కుక్కలు, పక్షులు వీటిని తీసుకొచ్చి ఇళ్ల వద్ద, తాగునీటి టాంకుల వద్ద వదిలేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. నిత్యం మూడు నుంచి ఐదు వరకు పందులను వధిస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. వీటిని నివాసాల మధ్య కాకుండా దూరంగా వధించి అటు నుంచి అటే మాంసాన్ని తరలించేలా జీవీఎంసీ శానిటేషన్ విభాగం చర్యలు తీసుకోవాలని స్థానిక నివాసులు కోరుతున్నారు.


బాలాజీనగర్ యాతపేటలో నివాసాల మధ్య పడేసిన అడవి పందుల మాంస వ్యర్థాలు

జెడ్పీ హైస్కూల్ ముఖద్వారం వద్ద పశువుల తిష్ట

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్ ముఖద్వారం వద్ద పశువులు తిష్ట వేయడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. 45 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ హైస్కూల్ ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దింది. గతంలో పాఠశాలకు వచ్చే మార్గంలో 40 అడుగుల రహదారి ఉండేది. కొందరు ఆక్రమించేయడంతో ప్రస్తుతం 12 అడుగులు మాత్రమే మిగిలి ఉంది. ఉన్న ఈ కొద్దిపాటి రహదారిలోనూ పశువులను కట్టివేయడంతోపాటు, అక్కడే చిరుతిళ్లు విక్రయిస్తున్నారు. పాఠశాల రహదారిని శుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులు చేస్తున్న విన్నపాలను స్థానికులు పెడచెవిన పెడుతున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ అధికారులు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.


హైస్కూల్ ముఖద్వారం వద్ద పశువులు

విద్యుత్ కోతలతో రాత్రంతా జాగారం

సిబ్బంది పనితీరుపై మధురవాడ గ్రామస్తుల ఆగ్రహం

మధురవాడ: అనధికార విద్యుత్ కోతలతో జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని పాత మధురవాడ గ్రామస్తులు ఆదివారం రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. రాత్రంతా పట్టుమని 10 నిమిషాలు కూడా సరఫరా లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందించే సిబ్బంది ఈ సారి కనీసం ఫిర్యాదు చేద్దామన్నా నంబరు కూడా పనిచేయలేదని అంటున్నారు. స్థానిక సిబ్బందికి, అధికారులకు ఫిర్యాదు చేద్దామంటే వారు కూడా ఫోన్ ఎత్తడం లేదని ఆరోపిస్తున్నారు. ఇక్కడ సుమారు 100 వరకు నివాసాలుండగా చుట్టూ అత్యధికంగా అపార్ట్‌మెంట్లున్నాయి. ఇందులో సుమారు 40 నివాసాలకు మాత్రం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చుట్టూ అపార్ట్‌మెంట్లు, ఇతర నివాసాలకు కరెంటున్నా తమకు లేకపోవడం పట్ల పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రాజకీయ పార్టీలతో సంబంధాలున్న అనధికార సిబ్బంది వారికి కావాల్సిన వ్యక్తుల ఫిర్యాదులకే స్పందిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అపార్టుమెంట్ల వాసుల సేవలోనే తరిస్తున్నారు తప్ప సామాన్యుల సమస్యలు పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇక్కడ తరచూ కరెంటు కోత, లో ఓల్టేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వాపోతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉక్కపోతకు తోడు విద్యుత్ కోతలు

పీఎం పాలెం: ఒక వైపు ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంటే మరోవైపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో వినియోగదారులు ప్రత్యక్ష నరకం చూశారు. ఆదివారం రాత్రి పీఎం పాలెం నుంచి పాత పీఎం పాలెం, పిలకవానిపాలెం తదితర ప్రాంతాల్లో పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఉక్కపోతతో అపసోపాలు పడుతున్న ఆ ప్రాంతాల్లోని ప్రజలు మరింత అల్లాడిపోయారు. చిన్న పిల్లలు, వృద్ధులు మరింత ఇబ్బందిపడ్డారు. నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయడానికి అధికారులు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ఏఈ అప్పలనాయుడు మాట్లాడుతూ సాంకేతిక లోపాలు సరిచేశామని, ఇక మీదట నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు.

'కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం తగదు'

డాబాగార్డెన్స్: ఉన్నత విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో సిలబస్, పాఠ్యాంశాలకు సంబంధించి సంబంధిత చట్టబద్ధమైన కౌన్సిల్ ఆమోదం లేకుండా కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం సమర్థనీయం కాదని భారత ప్రభుత్వ ప్రత్యేకాధికారి జి.సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత సాంప్రదాయ విద్యా విధానం ప్రకారం ఉన్నత విద్యా వ్యవస్థలో నియమాలు, పాఠ్యాంశాలు, సిలబస్‌లు నిర్ణయించే భారత ప్రభుత్వ సంస్థలు మాత్రమే యూజీ/పీజీ/పీహెచ్‌డీ విద్యార్థుల ఉత్తీర్ణతను నిర్ణయించడానికి అర్హులన్నారు. ఉన్నత విద్యా సంస్థలు, విశ్వ విద్యాలయాల్లో ప్రవేశం పొందిన బ్యాచిలర్, మాస్టర్స్, డాక్టర్, డిగ్రీ విద్యార్థులకు యూజీసీ, వారి చట్టబద్ధమైన కౌన్సిల్ నిర్వహించే డిగ్రీ ఫైనల్ పబ్లిక్ పరీక్షలకు హాజరు, ఉత్తీర్ణత తప్పనిసరన్నారు. యూజీసీ జారీ చేసిన డిగ్రీ పాస్ సర్టిఫికెట్ ఉత్తీర్ణతకు రుజువుగా పరిగణిస్తారని చెప్పారు.